# మినీకథలు

## సిగరెట్

చుట్టూ దట్టంగా చీకటి. భూమ్యాకాశాలను కలిపేస్తో ఒకటే వర్షం. వుండుండి మెరుపులు కొండలపై జిగేల్ మని మెరిసి మాయమైపోతున్నాయి. వెంటనే పెద్ద శబ్దంతో వురుములు. రగ్గు మరింత దగ్గరకు లాక్కుని అలాగే చూస్తున్నాను. గాలి తెరతోపాటు అప్పుడొకసారి, అప్పుడొకసారి జల్లు తగులుతోంది. వొళ్ళు అప్పటికే కొంత తడిసి వుందేమో సన్నగా వొణుకు ప్రారంభమైంది. సిగరెట్ కావాలి. ఒక్కసారి గుండెనిండా ఆ పొగాకు పొగ పీలిస్తే ఎంత వెచ్చనో?— ఆలోచన్లు మరల్చాను. ఇలాంటి వానలో-ఈ రాత్రిలో కృష్ణశాస్త్రి అయితే— ఊఁ....హూ!

సంజీవదేవ్— "దబదబ వర్షం—గబగబ వర్షం"

ఉరుముల వర్షం
మెరుపుల వర్షం"

అంటో కవిత వ్రాస్తూ వుండేవాడా? కాదు. ఒక కిటికీ తెరిచి సన్నగా ఈలపాట పాడుకుంటూ వుండేవాడు.

చెలం— "ఈ రాత్రి ఇట్లో ఒంటరిగా ఆలోచిస్తూ కూర్చున్నాను. నీవు ఎలాగైనా వొస్తావని నా ఆశ. కానీ రావు. వొస్తేనా, నీ కళ్ళలోకి అలాగే చూస్తూ ఈ వర్షాన్ని.



రాత్రిని అనుభవిస్తావా?". అంటాడు. కానీ, ఎ-? ఎ- వొస్తే? నేనీ రాత్రిని, వర్షాన్ని చూడకుండా వుంటానా? ఎన్నటికీకాదు ఆమెతో కలిసి ఇలాగే ఝల్లులో తడుస్తా.... అబ్బ! సిగరెట్.... సిగరెట్ కావాలి. అదే నెల్లూరులో అయితే ఎన్ని తాగి వుండేవాడినో? సీమా "టీ" కూడా- బలవంతంగా ఆలోచన్లు మరలుస్తున్నాను. విస్కీ కొంచెం వెచ్చగా గొంతులోకి దిగితే....? పేదలు, నిర్భాగ్యులు గుర్తుకు వస్తారేమో శ్రీశ్రీకి? ఇల్లు లేని వాళ్ళు ప్లాట్ ఫాం ల మీద, కప్పులు లేని ఇళ్ళ క్రింద, కొమ్మలు లేని చెట్ల క్రింద- ముసలి, రోగి, పిల్లా, పడుచూ- కొమ్మలు లేని చెట్ల క్రింద మనుష్యుల సంగతి సరే- కొమ్మల మీది పిచ్చుకల సంగతి? పిట్టల సంగతి— లాభంలేదు ఇంక సిగరెట్ కావలసిందే. మంచి రచనొచ్చి వుండేది. కవితైనా- మరికొంత ఆలోచన జోడించి వ్రాసివుంటే ఏ పత్రికైనా దయతలచి ప్రచురిస్తే కీర్తి— డబ్బూను— మరి సిగరెట్? ప్చ్! తిలక్ "అమృతం కురిసిన రాత్రి" ఏ అమృతం గురించి రాశాడో గాని ఈ వాన యిప్పుడు అమృతం ప్రపంచానికి. చెరువులు, బావులూ ఎండి పంటలు లేక రైతులెంత బాధపడుతున్నారో? రైతులేంటి? తాగటానికి నీళ్ళు! అది సరే.. ఇప్పుడు సిగరెట్లో? ఎదురుగా బల్లమీద కొంత, కొంత తడిసి చూస్తోవుంది. నన్నేనా? విసురుగా అందుకొని వానలో మంచి బలంగా విసిరేశాను ఆ ఖాళీ పాకెట్ ను.

— లక్ష్మీ రమణ

## గ్లాసు

గుంటూరు స్టేషన్ లో అడుగుపెట్టే సరికి మద్రాసు వెళ్ళే సర్కార్ ఎక్స్ ప్రెస్ కూతవేసి కదిలింది. హడావుడిగా దొరికిన కంపార్టుమెంట్ ఎక్కేశాను రిజర్వేషను వుందికదా అన్న ధీమాతో. అత్తగారి వూరు మేడవారిపాలెం నుంచి ఆఖరి బస్సుకు బయలుదేరాను. అదికాస్తా ఆలస్యం కావటంతో స్టేషన్ కు రావడమూ ఆలస్యమైంది.

ఎలాగయితేనేం ఎక్కేశాంగదా అని ఆయాసం తీర్చుకుని పరిశీలనగా కంపార్టుమెంటును చూడగానే అర్థం అయింది అది "టూటైర్" అని. "ఇది గుంటూరు కోటాదేనా" ప్రక్కతన్ని అడిగాను. 'ఔ' నన్నాడు. ఆపదలో ఆనందం అన్నట్టు సంబరపడిపోయాను. అది సరిగ్గా నే నెక్కవలసిన కంపార్టుమెంటే.

నా సీటు నెంబరు వెతుక్కుంటూ వెళ్ళి మరింత ఆనందపడ్డాను. అది కిటికీ ప్రక్కన వున్నందుకు. నా సీటులో కూర్చునివున్న లావుపాటి శాల్తీని లేపి, తాఁగా కూర్చుని సెటిలయిపోయి సిగరెట్



వెలిగించాను. అప్పుడు గుర్తొచ్చింది నేను కాఫీతాగి చాలా సేపయిందన్న విషయం.

కడుపులో చిన్నగా కదలిక. తెనాలివరకూ ఓర్చుకోక తప్పదని ప్రక్క ప్యాసింజర్ల పరిశీలనలో పడ్డాను.

తెనాలిలో మెల్లగా ఆగింది రైలు. కాఫీ, టీ అమ్మేవాళ్ళు వొక్కసారిగా శత్రువు మీదికి సైనికులు పడ్డట్టు రైలు మీదికి దాడి చేశారు.

ఓ అబ్బాయిని పిలిచి "కాఫీ వేడిగా వుందా" అన్నాను. ఉందని ఓ కప్ అందించాడు. అందుకుని సిప్ చేశాను.

"ఎంత" అన్నాను.

"అరవై పైసలు సార్" అన్నాడు.

జేబు తడుముకున్నాను. చిల్లరలేదు- అయిదు రూపాయల నోటు తప్ప. "చిల్లరుందా" అడిగాను.

"తెచ్చిస్తానివ్వండిసార్" అంటూ నోటు తీసుకెళ్ళాడు.

కాఫీ తాగేశాను. వాడింకా రాలేదు. నాలో అనుమానం ప్రవేశించింది. అయిదు రూపాయలు తీసుకెళ్ళాడుగదా,వాడిక వస్తాడా అని.

గ్లాసుంది కదా అనుకున్నాను. అయినా గ్లాసెంత చేస్తుంది మహాఅయితే ఒక రూపాయి.వస్తాడా, రాడా అన్న సస్పెన్సుతో నా తల బద్దలై పోతోంది. "ఓ అమాయకుడి నిజాయితీ శంకిస్తున్నావు" మనసు చీవాట్లే సింది. సరే చూద్దాం. ఇదీ ఓ గుణపాఠంలా వుంటుంది. వాడు రాకపోయినా గ్లాసుందికదా అనుకున్నాను. ఓ మనిషి నిజాయితీ విలువ అయిదురూపాయలా అనిపించింది.

కూతవేసింది రైలు. మెల్లగా కదిలింది. కిటికీలోంచి చూశాను వాడికోసం. ఇక రాడనుకున్నాను. మెల్లగా స్పీడందుకుంది రైలు. కిటికీ దగ్గరే వుంది నా తల

రొప్పుతూ రైలు వెంట పరుగెత్తుకొస్తున్నాడు వాడు వాడి నిజాయితీ శంకించినందుకు నన్ను నేనే తిట్టుకుంటూ, మానవత్వం మీద మరోసారి నమ్మకం పెంచుకుని కిటికీ గుండా రెండు చేతులూ బయట పెట్టాను—ఒక చేత్తో గ్లాసందిస్తూ మరో చెయ్యి చిల్లరకన్నట్లు.

ఇంకొంచెం స్పీడందుకుంది రైలు. కిటికీ దగ్గరికి వచ్చినవాడు గ్లాసు లాగేసుకుని చిల్లర యివ్వకపోగా వెక్కిరించినట్లు నవ్వి ఆగిపోయాడు. వాడిని దాటిపోయింది రైలు.

ఆవాక్కయిపోయాను, వాడి తెలివితేటలకు. మనస్సు సిగ్గుపడి మాట్లాడం మానేసింది వాడి నిజాయితీ గురించి.

—సి. శైలకుమార్

## నాంది

పైడితల్లి తెచ్చియిచ్చిన యిచ్చు రూపాయి —ఉప్పువేసి ఉడకేసిన కందమూలం దుంపలు తీసుకొని, ఒక గంపనిండా చింత పండు యిచ్చాడు గిరిజనుడు.


వల్లం నుంచి కొండమీదకు పోయి, ఏ కాలంలో దొరికే వస్తువులు ఆ కాలంలో గిరిజనులదగ్గర వస్తు మారకం చేసుకొని వాటిని తెచ్చి బస్తీలో అమ్ముకోడం పైడితల్లి వ్యాపారం.ఆ విధంగానే ఆ రోజు గిరిజనుడు ఇచ్చిన చింతపండు కార్పొరేషన్ వాళ్ళు బాధపడకుండా ఉండేందుకు, పట్నం తీసుకెళ్ళకుండా, కొండ దిగువనే, ఇల్లు కట్టుకొని వ్యాపారం చేసుకొంటున్న వరాల సెట్టికి అమ్మేశాడు పైడితల్లి.

కార్పొరేషన్ వారి లారీ డ్రైవర్‌కే ఎంతో కొంత ముట్టచెప్పి, అదే చింత పండులో కొంత చిల్లర వ్యాపారం కోసం ఉంచుకొని. మిగిలింది పట్నంలో వున్న సేట్ గోపీచంద్‌కి తాను కొన్న ధరకి రెట్టింపు చేసి పంపించేశాడు వరాలశెట్టి.

వరాల శెట్టి దగ్గరనుంచి వచ్చిన చింత పండునే.కొంచెం శుభ్రం చేయించి, ప్లాస్టిక్ కవరులో నింపించి, తాను కొన్న ధరకంటె మూడురెట్లు ధర పెంచి, దేశాలకి పంపించేశాడు శేఠ్ గోపీచంద్.

ఈ వ్యాపారమంతా ఇలాగే, సాగుతూ వుంటుంది....

నిత్యావసర వస్తువులతోపాటు చింత పండు కూడా అవసరం వచ్చింది గిరిజనుడికి. అది కొనుక్కొని పోదామని కొండ దిగువనున్న వరాలశెట్టి దుకాణానికి వచ్చేడు గిరిజనుడు. అక్కడ శెట్టి దుకాణంలో, రేడియో, దేశంలోని వార్తలు అప్పచెప్పేస్తోంది.



చింతపండు కావాలని అడిగిన గిరిజనుడికి, పావలా తీసుకొని, నల్లగా మట్టి ముద్దలా వున్న ఒక పిడచ పండు ఇచ్చాడు శెట్టి. తన చేతిలోవున్న చింతపండు వంక ఒకసారి, శెట్టి చేతిలోవున్న తన పావలా కాసు వంక ఒకసారి, మార్చి మార్చి ఆశ్చర్యంగా చూడసాగాడు గిరిజనుడు.

"ఏట్రా అలాగసూత్తన్నావ్! అది చింత పండేరా! ఇప్పుడు రేడియోలో వార్తలు వినలేదా? దేశంలో పండు ఖరీదు కిలో పది రూపాయలు అయిందని.అయినా అయ్యన్నీ నీకేటి తెలుస్తాయి. ఎల్లెల్లు" అని కసురుకొన్నాడు శెట్టి

చేతిలో ఉన్న చింతపండు చూస్తూ కొండెక్కిపోయాడు గిరిజనుడు.

"ఇదేటి యిచిత్రం! నాకాడనుండెళ్ళిన చింతపండు, నాకు కావలసి వచ్చేసరికి, ఖరీదులోనే కాకుండా, రంగులోకూడా ఇంత మారిపోయినాదేటి!" అని పులుపుచాలని పులుసు తింటూ ఆలోచించాడు బ్రతుకు తెరువు తెలియని గిరిజనుడు.

—"యస్సార్లు"